ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 17 నవంబరు 2024



న్యూస్ బాక్స్

జాబ్ మేళాకు స్పందన

ధర్మారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మారం అలయన్స్ క్లబ్ ఆధర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సమర్థనం ట్రస్ట్ ఫర్ ది డిసబుల్డ్, ప్రథమ్ ఎడ్యుకేషన్ పౌండేషన్‌తో సంయుక్తంగా అలయన్స్ క్లబ్ ఈ మేళాను నిర్వహించింది. అర్హత సాధించిన వారికి మూడునాలుగు రోజుల్లో కాల్‌లెటర్స్ వచ్చే అవకాశం ఉందని నిర్వహకుల తెలిపారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, ఎలగందుల అశోక్, ఎలిగేటి మహేందర్, తోడేటి మురళి, కందుల సతీష్, బొల్లం మల్లేశం, భైరి చంద్రమౌళి, అమరపల్లి నారాయణ, వేల్పుల కొమురయ్య, దేవి అంజయ్య, జిడుగు రాము, మెరుగు మల్లేశం, గంటాయి సతీష్, కన్నం సతీష్, మద్దునాల మల్లేశం, ఎండి రఫీక్, రత్నాకర్ రెడ్డి సతీష్ తదితరలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ముత్తారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో భోజన విరామ సమయంలో 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధించే వారికే మద్దతు ఉంటుందని వారు తెలియాజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శాంతి, చైతన్య అశోక్, సునీత, స్వర్ణలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..



- రామగుండంలో పుట్టగొడుగుల్లా ఫంక్షన్ హాల్స్
- రైస్‌మిల్లులు, సినిమా టాకీస్‌లు, స్కూల్ భవనాల్లో నిర్వహణ
- రెసిడెన్షియల్ బిల్డింగ్స్‌పై బాంక్వెట్ హాల్స్
- కార్పొరేషన్‌లో 46 ఫంక్షన్‌హాల్స్, బాంక్వెట్ హాల్స్

కోల్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఫంక్షన్ హాల్స్ బాంక్వెట్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో వాటి యజ మానులు, నిర్వాహకులు ఎలాంటి నిబంధలు పాటిం చడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రామగుండం ప్రాంతంలో శుభకార్యాలకు ఒకప్పుడు సింగరేణి కమ్యూని టీహాల్ దొరకాలంటేనే గగనమయ్యేది. అలాంటిది ఇప్పుడు గల్లిగల్లీకి ఫంక్షన్ హాల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఫంక్షన్‌హాల్స్, బాంక్వెట్ హాల్స్ విచ్చలవిడిగా వెలిశాయి. మూతపడిన పాఠశాలలు, రైస్‌మిల్లులు, మూతపడిన సినిమాహాల్స్ ఫంక్షన్ హాల్స్‌గా మారిపోతున్నాయి. భవనం పెద్దదైతే చాలు బంకెట్ హాల్ చేస్తున్నారు. రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని, ఎఫ్‌సీఐ గౌతమినగర్ ఏరియా, ఖైటింక్లయిన్‌కాలనీల్లో 46ఫంక్షన్ హాల్స్, బాంక్వెట్ హాల్స్ ఉన్నాయి. ఇందులో ఈ రెండేళ్లలో వెలిసిన బాంక్వెట్ హాల్స్ 12 ఉన్నాయి. ప్రజల ఆలోచనలు కూడా శుభకార్యాలు ఫంక్షన్‌హాల్స్ వైపు ఉండడంతో డిమాండ్ కూడా ఉంది. ఇటీవల ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్మాణాలు కూల్చివేయడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఈ అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది.

ఒక్క ఫంక్షన్‌హాల్‌కూ అనుమతి లేదు..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఫంక్షన్‌హాల్స్, బాంక్వెట్ హాల్స్‌కు మున్సిపల్ రికార్డు ప్రకారం అనుమతులు లేవు. కొందరు యజమానులు రెసిడెన్షియల్, ఇతర భవనాల అనుమతులు తీసుకుని ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఫంక్షన్ హాల్ కూల్చివేతతో ఈ ఫంక్షన్ హాల్స్, బాంక్వెట్ హాల్స్‌పై చర్చ జరుగుతోంది. సాధారణంగా సామాజిక వర్గాలు నిర్మించుకునే కమ్యూనిటీ హాల్స్, ఇతర భవనాలకు అనుమతుల విషయంలో ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తుంది. సామాజిక వర్గాలు చందాలు వేసుకుని ప్రభుత్వ సహకారంతో భవనాలు నిర్మించడం పరిపాటి. వాటిని సామాజిక అవసరాలు శుభకార్యాలకు నామమాత్రపు రేట్లపై అద్దెలకు ఇస్తారు. కానీ నగరంలో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా ఫంక్షన్‌హాల్స్, బాంక్వెట్ హాల్స్ వెలిశాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితం..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు దశాబ్దాల క్రితం కేవలం సింగరేణి, ఎన్‌టీపీసీకి చెందిన కమ్యూనిటీ హాల్స్ మాత్రమే ఉండేవి. గోదావరిఖని ఆర్‌జీ-1 కమ్యూనిటీ హాల్, ఆర్‌సీవోఏ క్లబ్, విఠల్‌నగర్‌లోని క్లబ్‌ను కార్మిక కుటుంబాల శుభకార్యాలకు నామమాత్రపు ధరలపై ఇచ్చేవారు. దీంతో నెలల ముందే వీటిని బుక్ చేసుకోవాల్సి వచ్చేది. తరువాత క్రమంలో ఫంక్షన్ హాల్స్ డిమాండ్ పెరగడంతో ఇక్కడ మూతపడిన ప్రైవేట్ పాఠశాలలు, రైస్‌మిల్లులు, చిన్న తరహా పరిశ్రమలు, సినిమా

మిగతా 8వ పేజీలో...

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 8,947 మంది అభ్యర్థులు.. 18 పరీక్ష కేంద్రాలు..



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న ఇన్విజిలేటర్లు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు జరిగే గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. టీజీపీఎస్సీ పరీక్ష ఏర్పాట్లు, సన్నద్ధతపై సంబంధిత అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 17 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు, నవంబర్ 18న ఉదయం 10గంటల నుంచి 12.30 వరకు గ్రూప్-3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పక్కాగా జరగాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 8,946 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 18 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసి, 18మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 18మంది డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, 18మంది అబ్జర్వర్లతోపాటు ఆయా రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, వైద్య, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి 3 పరీక్ష కేంద్రాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేశారు. పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పరీక్ష కేంద్రాలకు జిల్లా కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కే లక్ష్మీనర్సయ్య విధులు నిర్వర్తిస్తున్నారు. పరీక్ష కేంద్రాలను ఆదివారం రూట్‌ఆఫీసర్లు, అదనపు అధికారులు తనిఖీ చేశారు. ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు వీలుగా జాయింట్ రూట్ అధికారులను నియమించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరీక్ష కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, బెల్ ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికి సెల్‌ఫోన్ అనుమతి లేదని, ఎవరు ఫోన్ తీసుకొని రావద్దని కలెక్టర్ అన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ షాపులు మూసివేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించరని, ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష.. ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి తనిఖీ



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యంతో పాటు వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. 365పడకల ఆసుపత్రి అయిన తరువాత ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగిందని, వారికి వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో కలెక్టర్ నిధులతో మరమ్మతులు జరుగుతున్న లేబర్ రూం, ఎంసీయూ, రోడ్డు నిర్మాణ పనులను, కంటి ఆపరేషన్ థియేటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నూతనంగా నర్సింగ్ కళాశాల కోసం ప్రతిపాదించిన భవనాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట గైనకాలజిస్ట్ హెచ్‌వోడీ అరుణ, ఆర్ఎంవో అప్పారావు ఉన్నారు.

రామోజీరావుకు నివాళి

ఎలిగేడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివపల్లిలో తన నివాసంలో శనివారం రామోజీరావు జయంతిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, సుల్తానాబాద్ మార్కెట్‌కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ గాజుల లక్ష్మీరాజమల్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, బిరుదు కృష్ణ, మండల అధ్యక్షుడు చిలుక సతీష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి మహేందర్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, జానీ పాల్గొన్నారు.



పారిశుధ్య వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పారిశుధ్య పనులను మెరుగుపర్చండి

- నూతన పారిశుధ్య వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

8



మంథని శివారులో ఇటీవల రేషన్ బియ్యంతో పట్టుబడ్డ మినీ వ్యాన్

మంథని టూ మహారాష్ట్ర..

- జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా

6

తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ వేణు

మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి. వేణు ఆదేశించారు. స్థానిక మార్కెట్ యార్డులోని, మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమ శాతాన్ని రెగ్యూలర్‌గా చెక్ చేయాలన్నారు. 17 శాతం తేమ రాగానే వెంటనే కొనుగోలు చేయాలన్నారు. వడ్ల వివరాలను వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదుచేస్తూ రైతులకు ధాన్యం డబ్బులు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. మద్దతు ధరపై కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లర్లకు తరలించాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయవద్దని అన్నారు. అకాల వర్షంతో పంట దెబ్బతినకుండా టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి

కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలని, డీలిమిటేషన్‌తో ముడి పెట్టవద్దని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన జిల్లా మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీలిమిటేషన్ పేరుతో 2029 వరకు రిజర్వేన్లు వాయిదా వేయవద్దని, తక్షణమే రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గ్యారంటీలను వెంటనే అమలుచేయాలని, మహిళలకు సోలార్ పవర్‌ప్లాంట్లు, ఇందిరా మహిళా శక్తిసంఘాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 90శాతం రుణాలను బ్యాంకర్లు ఇవ్వాలని, 10శాతం మహిళా సంఘాలు భరించాలని సూచించడం మహిళా సంఘాల స్వయం సమృద్ధికి దోహదపడుతాయన్నారు. నవంబరు 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య నిర్మాణ కౌన్సిల్ జరుగుతుందని, దీనిని సభ్యులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ యూనివర్సిటీల్లో గంజాయి విస్తరించడం వల్ల విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని, దీనిని అరికట్టడానికి కాలేజీ యాజమాన్యాలు దృష్టిపెట్టాలని, మత్తు పదార్థాల మత్తుతో యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, వీటిని వెంటనే నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుమల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కనకరాజు, ఓదమ్మ, విజయ, తిరుమల, రమ, సుజాత, సౌజన్య, విజయలక్ష్మి, గోషిక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వ్యాసరచన పోటీలు

మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ న్యాయ విభాగం చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్రంలోని న్యాయవాదులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంథని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, న్యాయవాదులు చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, వరలక్ష్మి, శ్రీనివాస్ ఉన్నారు.

దళితులు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దళితుల ఫిర్యాదుపై పోలీసు శాఖ వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రం అన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రం పర్యటించారు. దళితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల న్యాయపరమైన హామీలకు భంగం కలగవద్దని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ ఏర్పాటుచేసిందన్నారు. దళితుల భూములు ఆక్రమణకు గురైనా, దళితులు దాడులకు గురైనా బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో కమిషన్ పనిచేస్తుందన్నారు. దళితులపై జరుగుతున్న దాడుల గురించి రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీని కలిసి వివరించడం జరిగిందన్నారు. హరిజన, గిరిజన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో సబ్సిడీ అందించడం లేదని, ఈ విషయంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి హరిజన, గిరిజనులకు సబ్సిడీ అందించాలని ఆయన కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే నేరుగా కమిషన్‌కు ఫిర్యాదు చేసి న్యాయం పొందాలన్నారు. ఎస్సీ ఎస్టీల కోసమే జాతీయ కమిషన్ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- సన్న వడ్లకు రూ.500బోనస్
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. శనివారం రామగుండం కార్పొరేషన్ 9వ డివిజన్ జనగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం కాంగ్రెస్ అని, ఎలాంటి కోత లేకుండా మద్దతు ధర కల్పిస్తామని భరసా ఇచ్చారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500బోనస్ కూడా ఇస్తున్నట్టు చెప్పారు. కొంత మంది ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని రైతులు నమ్మవద్దని ఆయన కోరారు. తడిచి మొలకెత్తిన ధాన్యం వేరుగా ఉంచాలని, మిల్లర్లతో మాట్లాడి వాటికి మద్దతు ధరతో కొనుగోలు చేయించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, జువ్వాడి మాధవరావు, విజయ్‌రావు, రుద్రభట్ల నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

పన్ను బకాయిదారుల ఆస్తుల వేలానికి రంగం సిద్ధం

కోల్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థకు దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయిపడిన మొండి బకాయిదారుల ఆస్తుల వేలానికి రంగంసిద్ధం చేశారు. రామగుండం తహసీల్దార్ ఇప్పటికే రెవెన్యూ రికవరీ చట్టం కింద ఫారం 1, 2, 4 నోటీసులు జారీ చేశారు. కొందరు స్పందించి రూ.24.69లక్షలు చెల్లించారు. మరో ఏడుగురు మొండి బకాయిదారుల ఆస్తుల వేలానికి చర్యలు చేపట్టారు. ఇందులో గోదావరిఖని శ్రీనగర్‌కాలనీలోని లోటస్ ఎంబీఏ కళాశాల భవనం రూ.15.26లక్షలు, మాతంగి కాలనీలోని నారాయణ, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, గురువారెడ్డిలకు చెందిన ఆస్తి పన్ను బకాయిలు రూ.24.81 లక్షలు, మాతంగి కాలనీలోని వీరాంజనేయ ఇండస్ట్రీస్ రూ.18.99 లక్షలు, అల్లూరులోని పాత ఫణి జూనియర్ కళాశాలకు సంబంధించి రూ.9.26 లక్షలు, శివరెడ్డి రూ.12.13 లక్షలు, కాసర్ల పాపయ్య రూ.2.71 లక్షలు చెల్లించాల్సి ఉందని కార్పొరేషన్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొంటున్నారు.

రామగుండం అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

- పరిసర ప్రభావిత గ్రామాల్లోనూ సేవలందించాలి..
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కలెక్టర్ శ్రీహర్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

కోల్‌సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం నగర అభివృద్ధిలో ప్రజలకు సేవలందించడంలో పరిశ్రమలు పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ శ్రీహర్ష కోరారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అనీల్ కుమార్, ఇన్‌చార్జి కమిషనర్, అదనపుకలెక్టర్ అరుణశ్రీ, సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌పీడీసీఎల్ నగరపాలక అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ పరిశ్రమలు కేవలం తమ క్వార్టర్లలోని పారిశుధ్యం, వీధి దీపాలు నిర్వహిస్తున్నారని, పక్కన ఉన్న కాలనీలు, ప్రభావిత ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమలు తమ ఆధీనంలోని ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇచ్చి నిర్వహణకు నిధులన్నా ఇవ్వాలని లేదా పూర్తిస్థాయిలో పరిసర ప్రాంతాల్లోని పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ అయినా చేపట్టాలని సూచించారు. సమీక్ష సమావేశాలకు పరిశ్రమల ఉన్నతాధికారులు రాకుండా కింది స్థాయి అధికారులను పంపించడం వల్ల వారికి సమస్యలు, పరిష్కారాలపై అవగాహన ఉండడం లేదన్నారు. ఇప్పటికే ఈ విషయాలపై పరిశ్రమల ఉన్నతాధికారులతో కూడా మాట్లాడామన్నారు. వెంటనే సమీప కాలనీల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ చేపట్టాలన్నారు. ఇందుకు పరిశ్రమల అధికారులు సానుకూలంగా స్పందించారు. పరిశ్రమలు కార్పొరేషన్‌కు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలన్నారు. నగరంలోని వివిధ కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామని, ఇందుకు విద్యుత్ స్తంభాలు, టవర్లను తొలగించాలని ఎమ్మెల్యే సూచించారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ పరిశ్రమలు తమ పరిసర కాలనీల్లో చేపట్టబోయే పారిశుధ్య పనులకు సంబంధించి వచ్చే శనివారం పూర్తిస్థాయి నివేదికలు సమర్పించాలన్నారు. ఆయా కాలనీలకు పారిశుధ్య నిర్వహణ బాధ్యులు వాహనాల గురించి కూడా తెలియజేయాలన్నారు. నగరంలో విద్యుత్ లైన్లు, స్తంభాలు అస్తవ్యస్థంగా ఉంటున్నాయని, వాటిని మార్చేందుకు అవసరమైన అంచనాలు తయారు చేసి తమకు సమర్పించాలన్నారు. అలాగే కొత్త వీధి దీపాల కోసం వేసిన లైన్లకు విద్యుత్ సరఫరా చేయాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి నగరపాలక సంస్థతో సమన్వయంతో పని చేయాలని, తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయాలన్నారు. టీయూఎఫ్ఐడీసీ పనుల్లో వేగం పెంచాలని, పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో తహసిల్దార్ కుమారస్వామి, ఎస్ఈ శివానంద్, సింగరేణి అధికారులు వర ప్రసాద్, జితేందర్‌సింగ్, ఎర్రన్న, ఎన్‌టీపీసీ అధికారులు సూర్యనారాయణ, ప్రవీణ్ చౌదరి, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు వెంకటరెడ్డి, హరికృష్ణ, ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రభాకర్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల శనివారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో వివాహం కావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉండే యువకుడు అప్పుల బాధ, కుటుంబ కలహాలతో ఉరివేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లె పునరావాస కాలనీకి చెందిన వ్యక్తి అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

● వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య


మహేందర్(ఫైల్)

వెల్గటూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జక్కుల మహేందర్ (35) అనే యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొన్నేళ్లుగా వివాహ ప్రయత్నాలు చేస్తున్నా సంబంధం కుదరడం లేదు. దీంతో మనస్తాపం చెందిన మహేందర్ శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తన మృతికి ఎవరు కారణం కాదని వివాహం కాకపోవడం వల్ల జీవితంపై విరక్తితో చనిపోతున్నానంటూ సూసైడ్ నోట్‌లో రాశాడు. మహేందర్ సోదరుడు జక్కుల రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

● అప్పుల బాధ, కుటుంబ కలహాలతో..


జగదీష్(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ ఎస్సై వివేక్, యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన దామనపల్లి జగదీష్(34)అనే యువకుడు కొంత కాలంగా కరీంనగర్‌లోని సీతారాంపూర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఆటో నడుపుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో జగదీష్ పర్సనల్ లోన్ తీసుకున్నాడు. వాయిదాలు సరిగా చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు జగదీష్‌ను డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జగదీష్‌కు రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది. కొన్ని రోజులుగా జగదీష్‌కు భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఓ వైపు లోన్ కట్టాలని బ్యాంకు సిబ్బంది. మరో వైపు భార్య నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 13వ తేదీన జగదీష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి జగదీష్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. శనివారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో చెట్ల పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్న జగదీష్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై తాండ్ర వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నరేష్, లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసు కున్నారు. జగదీష్ వద్ద లోన్ కోసం బ్యాంకు అధికారి, భార్య వేధింపులు తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్ లభించింది. జగ దీష్ అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

● అనారోగ్యంతో వ్యక్తి ..

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కలత చెంది రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లె పునరావాస కాలనీకి చెందిన మోత్కూరి శ్రీనివాస్(55) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముల్కలపల్లి గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాస్ ఆచూకీ కోసం గాలించగా చెట్టుకు ఉరేసుకున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొట్టే ప్రసాద్ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

జమ్మికుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసుపై హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ శనివారం విచారణ చేపట్టారు. పట్టణంలోని పద్మశాలి వీధిలో నివాసం ఉంటున్న ఈర్ల రజితను తమ ఇంటి పక్కన ఉండే వ్యక్తి అయిన మడిపల్లి అనిల్ కులం పేరుతో దూషించాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. నగురం గ్రామానికి చెందిన కవ్వంపల్లి లలితను అదే గ్రామానికి చెందిన పాశికంటి రాణి-తిరుపతిలు దూషించారని ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఏసీపీ వెంట ఎస్సై ఆరోగ్యం, సిబ్బంది ఉన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు..

● కలియదున్నితే మేలు


పోతిరెడ్డిపేటలో వరికొయ్యలకు నిప్పు పెట్టిన రైతు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యల దహనంతో భూమి సారం కోల్పోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కొయ్యలకు నిప్పు పెట్టే బదులు, వాటిపై సూపర్ పాస్పేట్ చల్లితే 15 రోజుల్లో కొయ్య మురిగి భూమికి పోషకాలు అందుతాయి. దీంతో ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు పెట్టుబడి ఆదా అవుతంది. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుంటే పంటల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడిని సాధించవచ్చు. రైతులు ప్రస్తుతం యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎక్కువ మంది రైతులు హార్వెస్టర్లతో వానాకాలం పొలాలను కోశారు. దీంతో వరి కొయ్యలు కాస్త పెద్దవిగా ఉంటాయి. ఈ కొయ్యలను తొలగించేందుకు ఖర్చవుతుందని భావించిన రైతులు మంట పెట్టి కాల్చేస్తున్నారు. దీంతో విపరీతమైన వేడివల్ల భూమిసారం కోల్పోతుంది. వరి కొయ్యలను కలియ దున్నడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుంది. దుక్కి దున్నేప్పుడు సూపర్ పాస్పేట్ చల్లితే రెండు వారాల్లో కర్ర మురిగుతుంది. భూమికి పోషకాలు అంది డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. కలియ దున్నితే ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది.

● నష్టాలెన్నో..

వరి కొయ్యలు కాల్చితే వేడితో భూమిలోని నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరవుతాయి. మట్టిలోని సూక్ష్మ జీవులు దెబ్బతింటాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. కాల్చగా వచ్చిన పొగతో వాతావరణం దెబ్బతింటుంది.

అవగాహన కల్పిస్తున్నాం..

- పొద్దుటూరి సతీష్, ఏఈవో, సిర్సపల్లి క్లస్టర్



రైతులకు వరికొయ్యల కాల్చివేతపై అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొంత మంది రైతులు కొయ్యలు కాల్చి వేస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే రైతులకు సాగు ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. రైతులకు ఎలాంటి సమస్యలున్నా మమ్మల్ని సంప్రదించాలి. యాసంగి సాగులో రైతులు జింక్‌ను వాడితే పంటలకు ఎంతో మేలు.

'జులాయి'లపై పోలీసుల కొరడా

- అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్
- 23 బైక్‌లు, కారు, ఆటోల సీజ్


బస్టాండ్‌లో ఉన్న వ్యక్తిని షెల్టర్‌హోంకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొందరు యువకులు అర్ధరాత్రి సమయాల్లో కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ గొడవలు పడడం, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే ఫిర్యాదులతో కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై జులాయిగా తిరుగుతున్న 30 మందిని పట్టుకుని 23 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారును సీజ్ చేసి ఠాణాకు తరలించారు. రోడ్లపై నిద్రిస్తున్న 20 మంది అనాథలను గుర్తించి షెల్టర్ హోంకు తరలించారు. ఆర్టీసీ బస్టాండ్, ఇందిరాచౌక్, ఎన్టీఆర్ చౌరస్తా, తీగల వంతెన ప్రాంతం, కమాన్, మార్కెట్ ఏరియాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు, ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రల సేకరణ తనిఖీలు కొనసాగాయి. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు రాత్రి సమయాల్లో ప్రతి రోజు పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

నగల షాపుల్లో దొంగల బీభత్సం

- రెండు దుకాణాల్లో 34 తులాల వెండి అపహరణ


మల్లాపూర్‌లో చోరీ చేసిన నగల దుకాణం

మల్లాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు నగల దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి మల్లాపూర్‌లోని రెండు నగల దుకాణాల తాళాలు పగుల గొట్టి 34 తులాల వెండి ఆభరణాలు అపహరించారని ఎస్సై కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన బెజ్జారపు గంగాధర్, తుమ్మనపల్లి శ్రీనివాస్‌లకు సంబంధించిన నగల దుకాణాలకు శుక్రవారం రాత్రి షటర్స్ మూసి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం ఇద్దరు షాపు యజమానులు వచ్చి చూసే సరికి వేసిన తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే షటర్స్ తెరిచి చూసేసరికి వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. బాధితులు షాపులలో 34 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో గాలింపు చర్యలు చేపట్టారు. అదే విధంగా సమీపంలోని ఓ ఇంట్లోనూ నిందితులు చోరీకి యత్నించినట్లు గ్రామస్తులు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ వరుగంటి రవి

వీణవంక నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని సీఐ వరుగంటి రవి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఘన్ముక్ల గ్రామానికి చెందిన బొంగోని పవన్ సాయి, నర్సింగాపూర్‌కు చెందిన బుర్ర శ్రీనాథ్ అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు వారి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారి వద్ద కిలో 135 గ్రాముల గంజాయి పట్టుపడింది. వీణవంక పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. నార్కోటిక్ పోలీసుల సూచన మేరకు పట్టుబడిన గంజాయి సీజ్ చేసి ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయి తక్కువ ధరకు తీసుకువచ్చి చిన్న ప్యాకెట్స్ చేసి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ 22,000 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల మృతికి కారకుడైన కారు డ్రైవర్ అరెస్ట్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతికి కారకుడైన డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఈనెల 12 రంగంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నలుగురు మహిళలు కూలీ పనులు ముగించుకొని ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో వెనుకాల నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఉదయ్‌నగర్‌కు చెందిన కుక్క అమృత, కుక్క భాగ్యలు అక్కడికక్కడే మృతిచెందగా, కుక్క పద్మ, కుక్క కాంతమ్మలకు గాయాలయ్యాయి. ఈ ఘనటలో కారుతో పాటు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఏసీపీ గజ్జి కృష్ణ సూచనల మేరకు మూడు బృందాలను ఏర్పాటుచేసి కారు కోసం తీవ్రంగా గాలించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా పోలీసులకు అందిన పక్కా సమాచారంతో యాక్సిడెంట్ చేసిన కారును అప్పన్నపేట గ్రామంలో దాచి సాక్ష్యాధారాలను మార్చేందుకు కారును మరమ్మతులు చేయించడానికి తీసుకువెళుతున్నారని తెలుసుకున్న పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోతారం గ్రామానికి చెందిన డ్రైవర్ చల్ల పవన్‌కళ్యాణ్, రాజేందర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. కేసును ఛేదించిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు, సిబ్బందిని ఏసీపీ కృష్ణ అభినందించారు.

ఖననం చేసిన శిశువు మృతదేహానికి పోస్టుమార్టం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 16(ఆంధ్యజ్యోతి): అధికారులు ఖననం చేసిన శిశువు మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. పట్టణంలోని బుడుగజంగాల కాలనీకి చెందిన రాజేశ్వరి కూతురి కళ్లెం లక్ష్మి ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రికి ఈ గురువారం రాత్రి వచ్చింది. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయడంతో ఆడ శిశువు పుట్టింది. అనంతరం శిశువుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని, కరీంనగర్‌కు తీసుకెళ్లాలంటూ వైద్యులు సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌కు తరలి స్తుండగా మార్గ మధ్యలో శిశువు మృతి చెందింది. మృతి చెందిన ఆడ శిశువు మృతదేహాన్ని శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇప్పలనర్సింగాపూర్ గ్రామ శివారులో ఖననం చేశారు. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బాధితురాలు ఆందోళనకు దిగారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ లక్ష్మి తల్లి రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. శిశువు మృతిపై కేసు నమోదు కాగా శనివారం ఖననం చేసిన శిశువుకు కాకతీయ వైద్య కళాశాల నుంచి వచ్చిన ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్‌రెడ్డి తహసీల్దార్ కనుకయ్య, సీఐ తిరుమల్‌గౌడ్ పర్యవేక్షణలో పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదికను ఉన్నతాధికా రులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చొప్పదండి , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కల్లెపల్లి ఆనంద్ (45) అనే వ్యక్తి శనివారం పోలీసుస్టేషన్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించారు. కల్లేపల్లి ఆనంద్ అనే వ్యక్తికి సంబంధించిన ఇంటి వద్ద పొరుగు వ్యక్తి గోడ నిర్మాణం చేపట్టాడని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీకి ఆనంద్ భార్య శనివారం ఫిర్యాదు చేసింది. సీఐకి ఫిర్యాదును అందజేయాలని చెప్పగా ఆనంద్ భార్య కూతురుతో చొప్పదండి పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. తనకు పోలీసులు న్యాయం చేయడం లేదంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. సిబ్బంది ఆనంద్‌ను అడ్డుకొని ఆస్పత్రికి తరలించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పిల్లిపల్లెలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి మేడలో ఉన్న సుమారు రూ. 20 వేలు విలువ చేసే పుస్తెలు అపహరణకు గురయ్యాయి. ఆలయంలో రాత్రి పెద్దఎత్తున శబ్దాలు రావడంతో సమీప ఇళ్లలోని ప్రజలు ఆలయ పూజారికి సమాచారం అందించారు. గౌడ కులస్థులు గుడి వద్దకు చేరుకోగా ఆలయంలో విద్యుత్తు సరఫరా నిలిపివేసి చోరీకి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. ఎస్ఐ కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

మంథని To మహారాష్ట్ర


మంథనిలో ఇటీవల పట్టుకున్న రేషన్‌బియ్యం నిల్వలు

● జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా
● రాజకీయ నేతల అండ.. అధికారులపై ఒత్తిళ్లు..

మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం మంథని ప్రాంతంలో పక్కదారి పడుతున్నాయి. రేషన్ బియ్యం కొందరు అక్రమార్కులకు, రేషన్ డీలర్లకు వరంగా మారింది. స్థానికంగా ప్రజాపంపిణీ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని రాష్ట్ర సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రంలో అధిక మొత్తానికి విక్రయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా పెద్దఎత్తున రేషన్ బియ్యాన్ని సేకరించి ఇళ్లలో అక్రమంగా నిల్వ చేయడం, ఆ తర్వాత వాహనాల్లో గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల, అధికారుల అండ దండలతోనే ఈ దందాను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా మంథని నియోజకవర్గ సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలో రేషన్ బియ్యానికి డిమాండ్ ఉండటాన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు, రేషన్ బియ్యం డీలర్లు వాటిని సేకరిస్తూ అక్రమంగా తరలించి లక్షల్లో సంపాదిస్తున్నారు.

● వినియోగదారుల నుంచే కొనుగోళ్లు..

ఇటీవల పట్టుబడిన కొన్ని వాహనాల్లో నేరుగా ప్రభుత్వం నుంచి రేషన్ డీలర్లకు వచ్చిన గన్నీ బ్యాగుల్లోనే అక్రమ రవాణాకు పాల్పడుతూ చిక్కారంటే రేషన్ డీలర్లు, గోదాంలపై రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని కొందరు డీలర్లు వినియోగదారుల బయోమెట్రిక్ ద్వారా బియ్యాన్ని పంపిణీ చేసి తిరిగి వారి వద్దనే కిలోకు రూ.8-10 వరకు కొనుగోలు చేస్తున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠాదారులకు రూ.12-15 వరకు విక్రయిస్తున్నారు. వారు మహారాష్ట్రలో కిలోకు రూ. 25-30 వరకు అక్కడి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా ఎవరికి వారుగా అందినంత దండుకుంటున్నారు.

అక్రమ దందాలో రాజకీయ నాయకులు..

గతంలో కొందరు వ్యాపారులు రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాను నిర్వహించి లక్షలు సంపాదించారు. అదిచూసిన కొందరు రాజకీయ నాయకులు సైతం రేషన్ బియ్యం స్మగ్లర్లుగా అవతారం ఎత్తారు. తమ నేతల అండదండలతో పట్టపగలే వాహనాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నా తర్వాత కేసుల విషయంలో, వాహనాలను విడిపించడంలో రాజకీయ నేతలు ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటున్నాయని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రేషన్ బియ్యం అక్రమ దందాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని మంథని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

● ప్రజలకు పంపిణీ చేయకుండా..

మంథని పట్టణంలోని రెండు చోట్ల, మండలంలోని సిరిపురం బ్యారేజీ వద్ద గత వారం రోజులలో పోలీసులు, సివిల్ సప్లై శాఖ అధికారులు తనిఖీలు చేయగా సుమారు 50 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. కొద్ది నెలల క్రితం సైతం పట్టణ శివారు, మండలంలో నెల రోజుల వ్యవధిలోనే 4 వేర్వేరు సంఘటనల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడడం గమనార్హం. ఈ ఘటనల్లో దాదాపు 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. తాజాగా ఈనెల 9వ తేదీన మండలంలోని సిరిపురం గోదావరినది బ్రిడ్జి వద్ద ఒక వాహనంలో 25 బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లై శాఖ అధికారులు పట్టుకొని గోదావరిఖనికి చెందిన శ్రీమోనుగుప్తాపై కేసు నమోదు చేసి వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేశారు. గత ఆదివారం మంథని పట్టణంలోని మందాట ఏరియాలో చల్ల నారాయణ ఇంట్లో అధికారులు తనిఖీలు చేయగా 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని అతనిపై కేసు నమోదు చేశారు. స్థానిక శ్రీపాదకాలనీలోని బోగె సర్వేశ్ ఇంట్లో పోలీసులు, సివిల్ సప్లై అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించగా 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 40 ప్లాస్టిక్ బ్యాగుల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి, మంథనిలోని రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు, రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి తన షాప్ నుంచి 7 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా తనకు అమ్మినట్లు సర్వేష్ వెల్లడించాడు. ఈ మేరకు సర్వేష్, డీలర్ గుండా ధనలక్ష్మిపై కేసులు నమోదు చేశారు.

స్కూటీ డిక్కీనుంచి లక్ష రూపాయలు అపహరణ


సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రం

కోరుట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబోడ్డు జన సంచారాల మధ్య సినీ ఫక్కీలో చోరీ జరిగింది. నిమిషాల వ్యవధిలో స్కూటీ డిక్కీలో నుంచి లక్ష రూపాయలు అపహరణకు గురి కావడం చర్చనీయాంశంగా మారింది. శనివారం మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన కొల వెంకట రమణ అనే వ్యాపారి పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ. లక్ష నగదును డ్రా చేసుకుని తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి పక్కనే ఉన్న గాంధీ రోడ్డులోని ఓ కిరణ దుకాణంలో సరుకులు తీసుకోవడానికి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెళ్లాడు. అప్పటికే అతడిని అనుసరిస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అక్క డకు చేరుకుని స్కూటీ డిక్కీ తెరిచి అందులో ఉన్న రూ. లక్ష నగదు అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. డబ్బులు తీస్తున్న విషయం కిరాణం దుకాణంలో పని చేస్తున్న గుమాస్తా గమనించి వెంకట రమణకు తెలిపే లోపే చోరీ జరిగిపోయింది. దుకాణదారులతో కలిసి నిందితులను వెతికే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే వ్యాపారులు కోరుట్ల పోలీసులకు సమచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట శివారులో శ్రీలక్ష్మీఇండస్ట్రీస్‌లో విక్రయిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌కు చెందిన చిత్తారి రమేశ్(29) అనే వ్యక్తి చుట్టుపక్కల గ్రామాలలో సేకరించి శ్రీలక్ష్మీఇండస్ట్రీస్‌లో విక్రయిస్తుండగా దాడులు చేసినట్లు తెలిపారు. బియ్యంతోపాటు ట్రాలీ ఆటో సీజ్ చేశామని, శ్రీలక్ష్మీఇండస్ట్రీస్ యజమానిపై, బియ్యం విక్రయిస్తున్న చిత్తారి రమేశ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

నీటి సంపులో పడి వృద్ధురాలు మృతి

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలు శనివారం నీటి సంపులో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాసరి కనకమ్మ (80) భర్త లేకపోవడంతో తన బాగోగులు ఇద్దరు కొడుకులు వెంకటేశ్వర్లు, సదానందం చూసుకుంటున్నారు. శనివారం కనకమ్మ ఇంటి ముందున్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది.

ధర్మపురిలో కార్తీక రద్దీ



గోదావరి నది వద్ద గంగా హారతి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో శనివారం కార్తీక భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు.. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయ ణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు..

● ధర్మపురి క్షేత్రంలో 15 రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా సామూహిక దీపోత్సవం



కళాభవన్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయ కళావేదికలో ఏర్పాటు చేసిన దీపోత్సవాన్ని ఆలయ ముఖ్య అర్చకుడు గోపన్నగారి చందు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన చిందు యక్షగానము భక్తులను ఆకట్టుకుంది. కార్తీక మాసం సందర్భంగా శనివారం రాజన్నను 36 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఆరోగ్యం కోసం విటమిన్లు



అందమైన జీవితానికి మంచి ఆహారం

● మానసిక, శారీరక ఆరోగ్యంలో ముఖ్యపాత్ర

“ మనిషి జీవితంలో విటమిన్ల ప్రాధాన్యం ఎంతో ఉంది. రోజుకో విటమిన్ ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. వివిధ రకాల పరిశోధనల తర్వాత 13 రకాల విటమిన్లు ఉంటాయని కనుగొన్నారు. మానవుల శారీరక, మానసిక ఆరోగ్యానికి విటమిన్లే ముఖ్య పాత్ర పోషిస్తాయని గుర్తించారు. ఆయా విటమిన్లు ఉండే పదార్థాలు, వాటి వల్ల చేకూరే ప్రయోజనాలు తెలుసుకుందాం.

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

● విటమిన్ 'ఎ'

విటమిన్ 'ఎ' వల్ల కంటి చూపు, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల శారీరక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. విటామిన్ ఎ తక్కువైతే రే చీకటి, దృష్టిలోపం, శరీరం పొడిబారడం వంటివి జరుగుతాయి. ఈ విటమిన్‌ను పొందాలంటే కోడి గుడ్డులో తెల్లసొన, లివర్, నెయ్యి, పాలు, చీజ్, నారింజ, పుచ్చకాయ, తోట కూర, క్యారెట్, పాలు, పాలకూర తీసుకోవాలి.

● విటమిన్ 'బి1'

విటమిన్ 'బి1' లోపం వల్ల మతిమరుపు, పెరుగుదలపై ప్రభావం, బరువు తగ్గడం, పక్షవాతం, రే చీకటి, వచ్చే అవకాశాలు ఉన్నాయి. 'బి1' వల్ల నరాలు, గుండె మెరుగైన పనితీరు, కండరాల పటుత్వం పెరుగుతుంది. అన్ని రకాల ధాన్యాలు, ఆకు కూరలు, డ్రై ఫ్రూట్స్, పల్లీలు, చేపలు, రొయ్యలతో 'బి1' విటమిన్ లభిస్తుంది.

విటమిన్ 'బి2'

విటమిన్ 'బి2'తో జీవనాడి వ్యవస్థ పెరుగుదల సక్రమంగా ఉంటుంది. కంటి చూపు మెరుగవుతుంది. కణజాల వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. బీ2 లోపంతో పెదాలు, నాలుక, నోటి మూలల్లో కురుపులు, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. ఎక్కువైతే మూత్ర సంబంధిత సమస్యలు ఉంటాయి. పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, కోడి గుడ్లు, కాలేయం, ఆకు కూరలు, పచ్చని ధాన్యాల నుంచి పొందవచ్చు.

విటమిన్ 'బి3'

విటమిన్ 'బి3' గొర్రె, మేక లివర్, కిడ్నీలు, గుండె నుంచి, చేపలు, మాంసం, ధాన్యాలు, డేట్స్, ఫ్రూట్స్, నట్స్, లేగ్యూమ్స్, అవాకడోస్ నుంచి పొందవచ్చు. 'బి3' లోపంతో చర్మంపై మచ్చలు, డయేరియా, జీర్ణ సంబంధిత సమస్యలు, వాంతులు, డిప్రెషన్, కన్‌ఫ్యూజన్, ఇన్‌సోమినియా, లాస్‌ఆఫ్ ఆపెటైట్ వంటివి వస్తాయి.

విటమిన్ 'బి5'

విటమిన్ 'బి5'తో జీవనాడి వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీన్ని అన్ని రకాల ధాన్యాలు, నట్స్, లేగ్యూమ్స్, పుట్ట గొడుగులు, కాలేయం, గుండె, చేపలు, కోడి గుడ్డు తెల్లసొన, పాల నుంచి పొంద వచ్చు. 'బి5' తక్కువైతే పాటిగ్యూ, ఇన్‌సోమి నియా, డిప్రెషన్, తలనొప్పి, వాంతుల ప్రభావం ఉంటుంది.

విటమిన్ 'డి'



విటమిన్ 'డి'తో ఎముకలు, దంతాలు గట్టిపడతాయి. కండరాల శక్తి పెరుగుతుంది. రోగ నిరోధక శక్తి పెంపునకు ఉపయోగపడుతుంది. శరీరంపై పడే సూర్య రశ్మి, నూనె, సముద్రం చేపలు, కోడి గుడ్డు, మాసం, పాలు, పుట్ట గొడుగులు, నెయ్యి నుంచి లభిస్తుంది. విటమిన్ లోపంతో కండరాల పటుత్వం తగ్గడం, ఎముకలు, రిక్కెట్, ఓస్ట్రో ఫారోసిస్ సమస్యలు వస్తాయి.

విటమిన్ 'ఇ'

విటమిన్ 'ఇ' ఆరోగ్య కరమైన కణజాలం, ఆర్గాన్స్, సెల్స్ రక్త ప్రసరణ, సంతానోత్పత్తి పెరుగుదలకు ఉపయోగపడుతుంది. పాలు నెయ్యి, కోడి గుడ్డు, నట్స్, గ్రేన్స్, విట్ జర్మ్ కూరగాయలు, ఆయిల్ నుంచి లభిస్తుంది. ఇది లోపిస్తే కండరాలు బలహీనత, దృష్టి లోపం, రక్త నాళాల సమస్యలు లోఇమ్యూనిటీ సమస్యలు వస్తాయి.

విటమిన్ 'కె'

విటమిన్ 'కె' చీజ్, మాంసం, లివర్, ఆకుకూరలు, ఓట్స్, పొటాటో, టమాట, కూరగాయలు సోయాబీన్స్ నుంచి లభిస్తుంది. రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఎముకలు, గుండె, మెరుగ్గా పని చేస్తాయి. తక్కువైతే రక్త స్రావం, చిగుళ్లు, ముక్కు నుంచి కూడా రక్త స్రావం అవుతుంది.

విటమిన్ 'బి6'

విటమిన్ 'బి6' ద్వారా జీనవాడి వ్యవస్థ, మెదడు పనితీరు మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తక్కువైతే కిడ్నీల్లో రాళ్లు, డిప్రెషన్, పాటిగ్యూ, నరాల సమస్యలు, చర్మంపై మచ్చలు, ఎక్కువైతే చాతిలో మంట కూడా వస్తుంది. వాల్‌నట్స్, పినట్స్, కార్న్, బ్రెడ్, చికెన్, లివర్, సాల్మాన్, టూనా చేప నుంచి లభిస్తుంది.

విటమిన్ 'బి7'

విటమిన్ 'బి7'తో బలమైన జుట్టు, గోర్ల ధృఢత్వం కోసం పని చేస్తుంది. కూరగాయలు, ధాన్యాలు, వాల్‌నట్స్, పినట్స్, సోయాబీన్స్, మాంసం, కోడిగుడ్డు తెలసొన నుంచి పొందవచ్చు. 'బి7'తో తక్కువైతే జుట్టు రాలడం, తెల్లబడడం, డిప్రెషన్, చర్మం పొడిబారడం, వాంతులు, కండరాల బలహీనతలు వస్తాయి.

విటమిన్ 'బి9'

విటమిన్ 'బి9' ఆకుపచ్చని కూరగాయలు, బీట్స్, విట్ జర్మ్, పినట్స్, ఆరెంజస్, బీన్స్, లీవర్, పాలు, గుడ్డు తెల్లసొన నుంచి 'బి9' పొందవచ్చు. ఎర్ర, తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. నరాల పనితీరు మెరుగు పడుతుంది. 'బి9' తక్కువైతే అలసట, నరాలు, జీర్ణ సంబంధిత సమస్యలు జన్యు పరమైన లోపాలు వస్తాయి.

విటమిన్ 'బి12'

విటమిన్ 'బి12'తో ఎర్ర రక్త కణాల పెరుగుదల, జీవనాడి వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తి పెంపుదలకు ఉపయోగపడుతుంది. గొర్రె, మేక లివర్, కిడ్నీలు, గుండె, మాంసం, కోడిగుడ్డు, చేపలు, డెయిరీ ఉత్పత్తుల నుంచి పొందవచ్చు. 'బి12' లోపిస్తే అనిమియా, నరాలు చిట్లడం, పాటిగ్యూ, లాస్‌ఆఫ్ అపేటైట్, శ్వాస కోశ సమస్యలు, వేళ్లు వంకర్లు పోవడం, వెన్నుపూస, నరాల సంబంధిత సమస్యలు వస్తాయి. ఎక్కువైతే శరీరంపై దద్దులు వస్తాయి.

విటమిన్ 'సి'

విటమిన్ 'సి' పాలు, బత్తాయి, కమలాలు, నేరేడు పండ్లు, స్ట్రాబెర్రిస్, జామ, మామిడిపండ్లు, పొటాటో, క్యాబేజీ, టమాటలో లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఖనజాల వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఎముకలు ధృడత్వంగా తయారవుతాయి. విటమిన్ తక్కువైతే జుట్టు రాలిపోవడం, జర్మ పొడిబారడంతోపాటు రక్తస్రావం అవుతుంది. ఎక్కువైతే కిడ్నీలో రాళ్లు ఏర్పడుతాయి.

నేతన్నలు మార్కెట్‌తో పోటీపడాలి

- ఆర్థికంగా ఎదగాలి
- యారన్ బ్యాంక్ 30 ఏళ్ల కల
- 20న వేములవాడలో సీఎం సభ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పాల్గొన్న యజమానులు, ఆసాములు

సిరిసిల్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్‌తో పోటీ పడాలని, పరిశ్రమ, నేతన్నలు మరింత వృద్ధిలోకి రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమస్థితి గతులపై చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్‌తో కలిసి పరిశ్రమ యజమానులు, ఆసాములతో సమీక్ష నిర్వహించారు. పారిశ్రామికులు, ఆసాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్వీఎంకు సంబంధించి 66 లక్షల మీటర్ల ఆర్డర్లు ఇవ్వను న్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలకు కావాల్సిన బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళా సంఘాలకు ఏడాదికి రెండు చీరలు ఇవ్వనున్నామని, వాటికి సంబంధించిన డిజైన్లు పూర్తయ్యాయని, త్వర లోనే అవసరమైన ఆర్డర్లు ఇస్తామని ప్రకటిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, యారన్ బ్యాంక్ అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేశారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 30 ఏళ్ల కలగా ఉన్న యారన్ బ్యాంక్ ఏర్పాటు నెరవేరుతోందన్నారు. 80 శాతం క్రెడిట్‌పై యారన్ అందజేస్తామని, టెస్కో ఆధ్వర్యంలో క్లాత్‌ను సేకరిస్తామని అన్నారు. కాటన్ వస్త్ర పరిశ్రమకు సహకారం అందిస్తామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. విద్యుత్ సబ్సిడీ అంశం, డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ మంత్రితో చర్చిస్తామని ప్రకటించారు. సిరిసిల్లలో నిలిచిన పద్మశాలీ భవనం పూర్తి చేసే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిరిసిల్ల అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదన్నారు. సిరిసిల్ల పరిశ్రమపై ఆధారపడిన కార్మికులు మనోధైర్యంతో ముందుకు సాగాలని, పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 20న వేములవాడకు రానున్నారని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతు న్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలో మధ్యాహ్నం 12.30 గంటలకు సభ ఉంటుందని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఆధునికత వైపు వెళ్లాలి



మాట్లాడుతున్న శైలజరామయ్యార్

మార్కెట్‌లో వస్తున్న ఆధునికత వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వెళ్లాలని చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్ అన్నారు. సమీక్షలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఆరు నెలల వరకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొం దిస్తోందన్నారు. మిగతా రోజుల్లో ప్రైవేటు మార్కెట్ లో ఉపాధి పొందేలా ఆలోచన చేయాలన్నారు. త్వరలో హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం ఏర్పా టు చేస్తామన్నారు. వారికి అవసరమైన బట్ట ఉత్ప త్తిపై చర్చిస్తామన్నారు. యారన్ బ్యాంక్‌ను సద్విని యోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు. వస్త్ర పరిశ్రమకు చెందిన రూ. 200 కోట్ల వరకు బకాయిల విడుదల చేశామని, యారన్ సబ్సిడీ కూ డా విడుదల చేస్తామని అన్నారు. మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, టెస్కో జీఎం అశో క్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూపరెడ్డి, జౌళి శాఖ ఏడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా మాజీ సర్పంచ్‌లు

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు కోరారు. శనివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరోనా సమయంలో శవాలను మోస్తూ, గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడ్డామన్నారు. గ్రంథాయలయాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామ పంచాయతి భవనాలు, డంపింగ్ యార్డు, మిషన్ భగీరత, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ, బతుకమ్మ తెప్ప, కమ్యూనిటీ భవనాలు, హైమాస్ట్ లైట్లు, శ్మాసన వాటికలు, రైతు వేదికలు, మన ఊరు మన బడి పనులు చేపట్టామన్నారు. ఎండీ రికార్డులు కూడా రెడీ చేసుకొని సకాలంలో ఇవ్వకపోవడం వల్ల అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎంపీడీవో నుంచి ముఖ్యమంతి వరకు అం దరికీ వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. జిల్లాకు రూ.250 కోట్లు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పంజాల జగన్‌మోహన్‌గౌడ్, కరుణాకర్, అంజయ్య రమేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాడికల్ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం శనివారం రాత్రి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై కొత్తపల్లి రవి తెలిపిన వివరాల మేరకు.. తాడికల్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమనాస్పదంగా కనిపించిన మూడు ఆటోలను ఆపి తనిఖీ చేశామన్నారు. ఈ ఆటోల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. మూడు ఆటోలను సీజ్ చేసి వాటిలో ఉన్న శ్రీనివాస్ ,రవి, నరసింహను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

- రోడ్డుపై విద్యార్థినుల నిరసన



ధర్నా చేస్తున్న లక్ష్మీపూర్ ఎంజేపీ విద్యార్థినులు

జగిత్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతి బాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మమత తమకు వద్దూ లక్ష్మీపూర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం రోడ్డెక్కి నిరసనకు దిగారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బయటకు వచ్చి రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపల్ మమతను తొలగించాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో ఏ ఒక్క సమస్యను ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పాఠశాలకు వచ్చిన తమ తల్లిదండ్రులతో సరిగా మాట్లాడనివ్వరని, వారితో సైతం అసభ్యంగా ప్రవర్తించేవారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను తొలగించేవరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు పట్టుబట్టారు. పాఠశాలలో ఉన్న టీచర్లు వచ్చిపిల్లలకు సర్దిజెప్పడంతో తిరిగి హాస్టల్‌కు వెళ్లారు. మమతను సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్‌సీవో ప్రకటించడంతో విద్యార్థినిలు శాంతించారు.

- లక్ష్మీపూర్ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్..

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మమత ను సస్పెండ్ చేస్తూ గురుకుల స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సైదులు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్‌సీవో అంజలి తెలిపారు. రెండు రోజుల క్రితం లీవ్‌పెట్టిన ప్రిన్సిపల్ లీవ్‌లో ఉండి పాఠశాలకు హాజరైన సందర్భంలో ఆమె వ్యక్తిగత విషయానికి సంబంధించి గొడవ జరిగినట్లు ఆర్‌సీవో తెలిపారు. పాఠశాలలో జరిగిన ఈ గొడవకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌సీవో అంజలి, జిల్లా కోఆర్డినేటర్ సుస్మిత సంయుక్తంగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

- ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టాలని ప్రభుత్వవిప్ ఆదేశం

జగిత్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం లోని లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాల ని డిమాండ్ చేస్తూ శనివారం రోడ్డెక్కి ధర్నా చేసిన విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జిల్లా అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- పదేళ్ల గత ప్రభుత్వ హయాంలో రూ.7.5 లక్షల కోట్ల అప్పు - రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా శనివారం ఉదయం వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. అనంతరం రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని, ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభు త్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకొస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే 19వ తేదీన వరంగల్‌లో మహిళా సదస్సు, 20వ తేదీన వేములవాడ రాజన్న ఆలయంలో, 25వ తేదీన కరీంనగర్‌లో యువజన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లగచర్లలో ఫార్మా ఇండస్ట్రీయల్ కారిడార్ భూసేకరణ కోసం జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో అధికారులపై దాడికి సంబంధించిన విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ అసలు కిషన్‌రెడ్డి మంత్రి పదవికి అర్హుడా.. కాదో? తెలియడం లేదన్నారు. అధికారులపై దాడి సరికాదంటూనే గ్రామ స్థులను అరెస్టు చేయొచ్చా? అని ప్రశ్నిస్తారన్నారు. ఏం చేయమంటారో ప్రభుత్వానికి సలహా ఇవ్వవచ్చు కదా అని హితవు పలికారు. కేంద్ర మంత్రి పదవిలో ఉండి అలా మాట్లాడటం సరికాదని అభిప్రాయపడ్డారు. కుల గణన సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇప్పటి వరకు 40 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు.

కేటీఆర్‌ను అరెస్టు ఎప్పుడు చేస్తారు? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు 'నేను ఎంక్వయిరీ అధికారిని కాదు. చట్టం పని చట్టం చేసుకుంటూ పోతుంది. ఇతర నాయకుల మాదిరిగా నేను అరెస్టు చేపిస్తానని చెప్పను. నేను అరెస్టు చేయమంటే చేస్తారా' అని ఎదురు ప్రశ్నించారు. రాజన్న ఆల పాలకవర్గం ఏర్పాటుపై అథారిటీ ఉన్నప్పుడు పాలకవర్గం ఏర్పాటు చేయరాదన్నారు. చట్టపరమైన అంశాలను పరిశీలించి ముందుకెళ్తామన్నారు. అంతకు ముందు రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి మంత్రికి ప్రసాదం అందజేశారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజావసరాలను గుర్తించడానికే సర్వే

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలను గుర్తించడానికే ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందని ప్రజలంతా సహకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాక ర్‌గౌడ్ కోరారు. శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మాట్లాడారు. సర్వేలో సేకరించే సమాచారంతో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. మంత్రి వెంట మల్యాల, కొడిమ్యాల మండలాల నాయకులు ఉన్నారు.

● అంజన్న సన్నిదిలో పూజలు

కొండగట్టు ఆంజనేయస్వామిని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి అధికారులు, అర్చకులు పూర్ణకుంబస్వాగతం పలి కారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఏఈవో అంజయ్య శాలువాతో సత్కరించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ ఉన్నారు. కొండగట్టు గిరిప్రదిక్షణ మార్గం అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ తన సొం తంగా రూ.2లక్షలు అందిం చనున్నట్లు తెలిపారు. గిరిప్రదిక్షణ గురించి ము త్యంపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు అందిస్తానని అన్నారు. గిరిప్రదిక్షణ చేసే భక్తులకు విశ్రాంతి, నీటి సౌకర్యానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు.

24న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్/రామడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉమ్మడి జిల్లా జిల్లా స్థాయి జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఎంపిక పోటీలను సిరిసిల్లలోని రైసింగ్‌సన్, స్పోర్ట్స్ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు శనివారం ఉదయం 10 గంటలకు కోచ్‌లు ప్రేమ్ కు మార్, కృష్ణహరి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్‌లకు రిపోర్టు చేయాలని పేర్కొ న్నారు. వివరాలకు 9441925807, 8978995730, 9603388143 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని ముత్తునూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగినరోడ్డు ప్రమాదంలో అంబారిపేటకు చెందిన ఆరెల్లి విఘ్నేష్ (20) అనే యువకుడు మృతి చెందాడు. విఘ్నేష్ మరో యువకుడితో కలిసి బైక్(టీఎస్ 21 జే6811)పై అంబారిపేట నుంచి ముత్తునూర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముత్తునూర్ ముక్తేశ్వర లిఫ్ట్ క్రాసింగ్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి లిఫ్ట్ బావికి ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం నడుపుతున్న విఘ్నేష్ అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

నేడు నిరసన ప్రదర్శన

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఆదివారం ఉదయం తలపెట్టిన ప్రభుత్వ ప్రజా వంచన నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను నేరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు, కార్య కర్తలు పాల్గొనాలని కోరారు.

ఉచిత దంత వైద్య శిబిరం

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో శనివారం గోదావరిఖనికి చెందిన శ్రీకాంత్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం సునీల్ మోహన్, వెంకటేష్, డాక్టర్ రేణుక, డాక్టర్ సిరి చందన, డాక్టర్ ప్రహర్ష, సంధ్యలు విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ అర్నకొండ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

యువకుడికి సన్మానం

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన పందిళ్ల శ్రీధర్ గ్రూప్-4లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో రేండ్లశారద-కుమారస్వామి, గంటపద్మ-వెంకటరమణరెడ్డి వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. పందిళ్ల శ్రీధర్‌కు రేండ్ల శారద రూ.5వేల ఆర్థిక సహాయం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మోల్మూరి శ్రీనివాస్, వెము కనకయ్య, సైండ్ల సత్యనారాయణ, తోట గోపాల్ పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను తప్పిదాలు జరగకుండా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని నిట్టూరు, తుర్కలమద్దికుంట గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. అధికారులు చేస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్‌లకు వాస్తవిక వివరాలతో కూడిన సమాచారం అందించాలని ఎంపీడీవో ప్రజలకు సూచించారు. వెంట పంచాయతీ కార్యదర్శులు శరత్ బాబులతోపాటు పలువురు పాల్గొన్నారు.

● ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 22 గ్రామాలలో కుల గణన సర్వేలను వేగవంతం చేశారు. శనివారం 13 గ్రామాల్లో 60కి పైగా గృహాల్లో ఎన్యూమారేటర్లు సర్వే నిర్వహించారు. ఓదెలలో నిర్వహించిన సర్వేను తహసీల్దార్ యాకయ్య పరిశీలించారు. మండలంలో 102 బ్లాక్‌లకు 98 మంది ఎన్యూమరేటర్లు సర్వేలు నిర్వహించి ఏడువేల ఇండ్లలో పూర్తి చేయగా, మరో ఏడువేల ఇండ్లల్లో సర్వేలు చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ, ఎన్యూమరేటర్ రమేష్ పాల్గొన్నారు.

● ముత్తారం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవో సురేష్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వేపై ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పంచాయతీకార్యదర్శులకు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇప్పటివరకు సర్వే చేసిన దరఖాస్తులను ఆన్లైన్‌చేయాలని, సర్వేలో ప్రతి విషయాన్ని నమోదుచేయాలని ఆన్లైన్ ప్రక్రియలో అనుమానాలు ఉండవద్దని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● ధర్మారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లి, లంబడి తండా (కె) కటికెనపల్లి గ్రామ పంచాయతీలలో శనివారం నిర్వహించిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను డీపీవో వీర బుచ్చయ్య పర్యవేక్షించారు.వెంట మండల పంచాయతీ అధికారి కె. రమేష్, సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రోడ్లపై పశువులు.. తప్పని ఇబ్బందులు



ప్రధాన రహదారిపై ఉన్న పశువులు



కుమ్ములాడుకుంటున్న పశువులు(ఫైల్)

కళ్యాణ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో రోడ్లపై పశువుల సంచారంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంబోతుల పోట్లాటలతో ప్రమాదాలు జరిగి చాలా మంది గాయాల పాలవుతున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా పశువులు గుంపులు గుంపులుగా ఉండడం, రాత్రి వేళ అవి కనబడకపోవడంతో వాహనచోదకులు వాటిని ఢీకొని మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. విఠల్‌నగర్‌లో నెలరోజుల క్రితం రోడ్డుపై నడిచి వెళుతున్న వారిని ఒక ఆవు పొడవడంతో సుమారు 50మంది గాయపడ్డారు. అలాగే లక్ష్మీనగర్‌లో ఆంబోతులు వీరంగం సృష్టించి ఓ టీవీ షోరూంలో దూరి టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ధ్వంసం చేశాయి. దీంతో రూ.2లక్షల వరకు నష్టం జరిగింది. పశువుల యజమానులు రోడ్లపై పశువులను వదిలి పెట్టడంతో అవి పోట్లాటకు దిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రామగుండం నుంచి యైటింక్లయిన్‌కాలనీ వరకు ప్రధాన రహదారిపై రోజు నిత్యం వందల సంఖ్యలో ఆవులు, గేదెలు పడుకొని ఉంటున్నాయి. రెండు నెలల క్రితం గాంధీనగర్ బస్టాండ్ వద్ద గేదెలను ఢీకొని యువకులు మృతిచెందారు. గేదెల పోట్లాటలతో అనేకమంది గాయాల పాలయ్యారు. గత మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నపూర్ణ కాలనీలోని బంజరుదొడ్డి కొన్ని పశువులను తరలించినప్పటికీ అవి మళ్లీ తిరిగి రోడ్లపైకి వచ్చాయి. వాటి యజమానులకు నోటీసులు జారీ చేసినా వారు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. పశువులు ప్రజల ప్రాణానికి సంకటంగా మారాయి. ప్రతి నిత్యం ఏదో ఒకచోట పశువులు గలాట చేస్తూ ప్రజలను పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి విధులకు వెళ్లే సింగరేణి కార్మికులకు చీకట్లో రోడ్లపై నిద్రిస్తున్న గేదెలు కనబడక వాటిని ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను బంజరుదొడ్లకు తరలించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

యజమానులపై చర్యలు తీసుకోవాలి

- మార్కపురి సూర్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి



రామగుండం కార్పొరేషన్‌లో రోడ్లపై పశువుల సంచారంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. యజమానులు వాటిని బయట వదిలిపెట్టి చేతులు దులుపుకుంటున్నారు. కార్పొరేషన్ పట్టించుకోవడం లేదు. కొన్ని పశువులను తరలించి చేతులు దులుపుకున్నారు. యజమానులకు నోటీసులు జారీ చేయాలి. కార్పొరేషన్ చొరవ చూపాలి.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెంది న గోవిందుల రాజయ్య ఇటీవల మృతిచెం దగా ఆయన చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు పూలమాల వేసి ఘ నంగా నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ముత్తారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సొల్లు సాత్విక్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. మంత్రి శ్రీధర్‌బాబు వైద్య ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబాని కి రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. శనివారం మంత్రి పీఏ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీ అందచేశారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

మార్కండేయకాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారులు పోలుసాని సంపత్‌రావు, క్యాతం వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్గాంకు కోమళ్ల మహేష్,పాలకుర్తికి పిడుగు కృష్ణ, ఎన్టీపీసీకి సుల్వ లక్ష్మీనర్సయ్య, యైటింక్లయిన్‌కాలనీకి మేరుగు హన్మంతుగౌడ్, జనగామకు కాసిపేట శివాజీ, తిలక్‌నగర్‌కు మహవాది రామన్న, లక్ష్మీనగర్‌కు దాసరి శ్రీనివాస్‌గౌడ్‌లను నియమించారు.

21న గోదావరిఖనిలో మతోన్మాద వ్యతిరేక సదస్సు



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఈనెల 21న జరిగే మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. శనివారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలుచేస్తూ భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని, ప్రజల మధ్య భావద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. మతం వ్యక్తిగతమని, కానీ మతం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో పాలక వర్గాల పార్టీలు ప్రజల ఆలోచనలను వక్ర మార్గం పట్టిస్తున్నాయని, తెలంగాణలోని మూన పార్టీలు, బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. రాజ్యాంగ విలువలు, పరిరక్షణ కోసం నల్ల చట్టాలకు వ్యతిరేకంగా మతోన్మాదం, కుల ఉన్మాదానికి తెలంగాణలో స్థానం లేదని చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. 21న జరిగే మతోన్మాద వ్యతిరేక ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీపీఎం జిల్లాకార్యదర్శి యాకయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న, నాయకులు జూపాక శ్రీనివాస్, మల్లేషం, గౌతం గోవర్ధన్, చంద్రశేఖర్, మహేశ్వరి, కుమారస్వామి, ఈదునూరి రమేష్, కృష్ణ, రమేష్, వెంకన్న, దుర్గయ్య పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..

(5వ పేజీ తరువాయి)

టాకీసులను ఫంక్షన్ హాల్స్‌గా మార్చారు. కొందరు స్థలాలను కొని ఫంక్షన్‌హాల్స్ కట్టారు. మొదట ఒకటి రెండుగా ఉండే ఫంక్షన్‌హాల్స్ ఇప్పుడు పదుల సంఖ్యలో చేరుకున్నాయి. వ్యాపారం బాగా సాగుతుండడంతో ఒకరిని చూసి ఒకరు ఈ రంగంలోకి వచ్చారు. ఎక్కడ పడితే అక్కడ ఫంక్షన్‌హాల్స్ పెట్టారు. కొన్ని కాలనీల్లో ఫంక్షన్‌హాల్స్‌కు వెళ్లేందుకు సరైన దారి కూడా ఉండని పరిస్థితులు ఉన్నాయి.

● నివాసాల మధ్యలో డీజేలు..

రామగుండం కార్పొరేషన్‌లో రెండేళ్లలో బాంక్వెట్ హాల్ సంస్కృతి వచ్చింది. వ్యాపార సముదాయాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ పైఅంతస్థుల్లో బాంక్వెట్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గోదావరిఖని, ఎన్‌టీపీసీల్లోని హోటల్స్‌లో బాంక్వెట్ హాల్స్ పెట్టారు. ఎన్‌టీపీసీ, మెయిన్ రోడ్డు, గోదావరిఖని మేదరిబస్తీ, లక్ష్మీనగర్, అశోక్‌నగర్, మార్కండేయకాలనీ, అడ్డగుంటపల్లి, ఎఫ్‌సీఐ తదితర ప్రాంతాల్లో ఈ బాంక్వెట్ హాల్స్ వెలిశాయి. నివాసాల మధ్య ఫంక్షన్‌హాల్స్, బంకెట్ హాల్స్ ఉండడంతో వాటిల్లో శుభకార్యాలు జరిగిన ప్రతిసారి చుట్టుపక్కల నివాసాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫంక్షన్ల సమయంలో పరిమితికి మించి డీజే సౌండ్స్ పెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పారిశుధ్య పనులను మెరుగుపర్చండి

- నూతన పారిశుధ్య వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్ పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. శనివారం రూ.1.04కోట్లతో కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పారిశుధ్య పనులను మెరుగుపర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రామగుండం నగరాన్ని సుందరంగా మార్చేందుకు అవసరమైన వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో కార్పొరేషన్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, రామగుండం నగరానికి పూర్వవైభవం తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. దీనికి ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలంటే పారిశుధ్య సిబ్బందితోపాటు మనవంతు పాత్రను పోషించాలని, ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో నగరాన్ని అలా ఉంచుకోవాలన్నారు. బయట చెత్త వేయకుండా ఇంటింటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తను అందజేయాలని కోరారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చేందుకు రూ.1.04కోట్లతో ఐదు ట్రాక్టర్లు, 8ఇతర భారీ వాహనాలు, 70ట్రిబుల్ లిట్టర్ బిన్స్, 100రెండు చక్రాల బారోలను తీసుకువచ్చామని, చెత్త సేకరణ వాహనాలు, సామగ్రిని వినియోగిస్తే నగరం పరిశుభ్రంగా ఉంటుందని, దీనికి ప్రజలు సహకరించాలని, చెత్తరహిత రామగుండంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ అరుణశ్రీతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పొత్కపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వంగ రవీందర్ శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే విజయరమణారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జ్వాలాతోరణం, లక్ష దీపార్చన

కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి గోదావరిఖని మార్కండేయకాలనీ శివాలయంలో జ్వాలా తోరణం, లక్ష దీపార్చన నిర్వహించారు. శివలింగానికి పాలాభిషేకం, పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

ఏబీవీపీ నాయకుల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న ఏబీవీపీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ పిలుపు మేరకు బాసర ధర్నాకు వెళ్లనున్నారనే సమాచారంతో శనివారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఏబీవీపీ నాయకులను అరెస్టు చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని స్వాతి ప్రియ ఆత్మహత్య నేపథ్యంలో ఆందోళనకు ఏబీవీపీ పిలుపునిచ్చింది. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను ఏ ప్రభుత్వం వచ్చినా పరిష్కరించడం లేదని, సెక్యూరిటీ గార్డులు అక్కడి ఏబీవీపీ కార్యకర్తలపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనకు కారకుడైన బాసర ట్రిపుల్ ఐటీ ప్రిన్సిపాల్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఆకుల శశికుమార్, ప్రశాంత్, అనిల్‌కుమార్, కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మాట తప్పకుండా బోనస్..

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పకుండా ధాన్యంకు బోనస్ ఇస్తోందని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే విజయరమణరావు సహకారంతో గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతోందన్నారు. క్వింటాలు ధాన్యంకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన ప్రకారం 500వందల బోనస్ కూడా ఇస్తున్నారన్నారు. వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేణ సదయ్య, నాయకులు ఎనగంటి రవి, సునీల్‌రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాటం..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

పెద్దపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగుల హక్కుల కోసం పోరాటం చేస్తామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు, ఉపాధి అవకాశాలను కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కనకం గణేష్ మహారాజ్ మాట్లాడుతూ ఈనెల 19, 20తేదీలలో జిల్లాల్లో అన్ని మండలాల తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, అత్యాధునిక వసతులతో ఉచిత వైద్యం, పనికి తగ్గ వేతనంతో ఉపాధి, నివసించడానికి ఇల్లు, సాగునీటితో కూడిన ఎకరం భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఆవునూరి సతీష్ మహారాజ్, క్యాదసి రమేష్, మాతంగి రేవంత్, ఎండీ అశ్రఫ్, ఏదుల్ల ప్రవీణ్, శనిగరపు కృష్ణ, దేవేందర్, ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.



పర్సనల్, సివిల్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ-2 అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్సనల్, సివిల్ అధికారులకు శనివారం జీఎం(ఐఆర్ పీఎం) కవితానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని ఏరియాల కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలు, వారి ఖాతాలు హెచ్‌డీఎఫ్ బ్యాంక్‌కు మార్పు చేయడంపై వివరాలు తెలుసుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల గైర్హాజరు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సివిల్, పర్సనల్ అధికారులతో చర్చించారు. ఏరియాల వారీగా కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమంపై వివరాలు తెలుసుకున్నారు. ఆర్జీ-2 ఏరియా సంబంధించిన వివరాలను డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్ వివరించారు. ఈ సమావేశంలో సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వంశీధర్ పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యేను కలిసిన ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీ-2 జీఎంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న బండి వెంకటయ్య శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌లను వేర్వేరుగా కలిశారు. ఏరియా ఉత్పత్తి, ఉద్యోగుల వివరాలను వారికి తెలియజేసిన జీఎం, భూసేకరణ, సింగరేణి అభివృద్ధి పనులను వివరించారు.

ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తిపై జీఎం సమీక్షా సమావేశం



అధికారులతో చర్చిస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతలపై శనివారం జీఎం వెంకటయ్య సురేష్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఓసీపీ-3, వీకేపీ గని బొగ్గు ఉత్పత్తి, యంత్రాల పనితీరు పని స్థలాలు, విడిభాగాలపై చర్చించారు. నెలవారి లక్ష్యాలను సాధించేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని అధికారులకు జీఎం సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, దానికి అనుగుణంగా యంత్రాల మెయింటనెన్స్ జరగాలని సూచించారు. ఉత్పత్తికి అనుగుణంగా రవాణా జరిగేలా దృష్టి సారించాలని అధికారులకు జీఎం దిశా నిర్దేశం చేశారు. ఈసమావేశంలో ఎస్వోటూ రాముడు, ఓసీపీ-3 పీఓ మధుసూదన్, వీకేపీ ఏజంట్ నెహ్రూ, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, పీఈ రాజాజీ, అధికారులు సంతోష్‌కుమార్, మురళీకృష్ణ, బూక్యదేశాయి, చంద్రశేఖర్, భరత్‌కుమార్, విజయ్ కుమార్, జనార్థన్, సదానందం, పండరీనాథ్, నర్సింహులు, రవికిరణ్, సునీత, వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ పిట్‌కమిటీ నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ఎస్అండ్‌డీ పిట్ కమిటీని నియమించారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ నూతన కమిటీని ప్రకటించారు. పిట్ సెక్రెటరీగా దాసరి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీలుగా గెల్లు సదయ్య(డ్రిల్ సెక్షన్), ప్రవీణ్(షావల్ సెక్షన్) ముప్పై మందితో కమిటీని ఏర్పాటు చేసినట్టు అయిలి శ్రీనివాస్ తెలిపారు. కార్మికులకు అందుబాటులో ఉంటూ ఎస్ అండ్‌డీ సెక్షన్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన జీఎం



క్రీడాకారులను సన్మానిస్తున్న జీఎం

మందమర్రి టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియాలో సింగరేణి కార్మిక క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి సింగరేణి సత్తా చాటాలని జీఎం దేవేందర్ తెలిపారు. గత సెప్టెంబర్‌లో కోల్ ఇండియాలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీలో వర్క్‌షాపులో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు గోల్డ్‌మెడల్, కాసిపేట గనిలో జనరల్‌మజ్దూర్‌గా పనిచేస్తున్న మనోహర్ బ్రాంజ్ మెడల్, క్లర్కుగా కాసిపేటలో పనిచేస్తున్న కావ్యశ్రీ పవర్‌లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధంచగా శనివారం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ ముగ్గురుని మిగతా క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

- ఖని సబ్ డివిజన్ వ్యాప్తంగా 7 సెంటర్లు : ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షకు అన్ని రకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జెన్‌టీయూసీ, గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్‌పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్, శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కాలేజ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్, ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెయింట్‌క్లేర్ హైస్కూల్, జెడ్‌పీహెచ్ఎస్ ఎన్‌టీపీసీ 7 సెంటర్లలో అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ (144సెక్షన్) అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు లాంటివి నిర్వహించకూడదని, అనవసరంగా గుంపులుగుంపులుగా ఎవరూ పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచించారు. అభ్యర్థులెవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపింగ్ చేసినట్లు తేలితే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్టీపీసీలో అలరించిన మ్యూజికల్ నైట్



నృత్యం చేస్తున్న కళాకారులు

జ్యోతినగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పీటీఎస్ స్టేడియంలో మ్యూజికల్‌నైట్ జరిగింది. స్వర్ణోత్సవాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కార వేణుగోపాల్‌రావు, రామగుండం, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, జి.వినోద్, మేయర్ అనిల్‌కుమార్, ఎన్టీపీసీ ఆర్‌ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ తదితరులు పాల్గొన్నారు.